


జిల్లాలో ఈ ఏడాది కూడా వరి ధాన్యం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. నిర్ధేశించుకున్న లక్ష్యం కొండంత ఉండగా.. సేకరించింది మాత్రం గోరంతే. దిగుబడి ఆశించిన బాగానే ఉన్నా సేకరణలో అధికారులు విఫలమయ్యారు. ఎక్కువ ధర కల్పించడం, కొనుగోళ్లలో



కొన్నది కొంతే..

షరతులు విధించక పోవడం, అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించడం తదితర కారణాలతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం అమ్ముకున్నారు. నదుపాయాలు కల్పించకపోవడం, మిల్లర్లు తరుగు పేరిట దోపిడీకి పాల్పడటంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావడానికి ఆసక్తి చూపలేదు. వ్యాపారులు పొలాల వద్దకు వెళ్లి పచ్చి వడ్లను కూడా కొన్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చుల భారం తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 40 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు 42 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,504 రైతుల నుంచి 7,310.920 టన్నులు ధాన్యాన్ని సేకరించారు. ఇందులో గ్రేడ్-ఏ రకం 7,285.720 టన్నులు, సాధారణ రకం, 25.200 టన్నులు కొనుగోలు చేశారు.

గతేడాది, ఈ సారి వానాకాలం సీజన్‌లో సాగైన పంటల వివరాలు



నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఆదిభట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా 10వ మహాసభలను శని, ఆదివారాల్లో ఇబ్రహీంపట్నంలోని భారత్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.యాదయ్య, బి.సామేల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జాన్‌వెస్లీ, నర్సింహారావు పాల్గొంటారని వారు చెప్పారు.



మేడిపల్లిలో పురాతన విగ్రహం లభ్యం

యాచారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో పురాతన విగ్రహం లభ్యమైంది. శుక్రవారం గ్రామానికి చెందిన యువకులు మైదానం ఏర్పాటుకు కంపచెట్లు, బండరాళ్లు తొలగిస్తుండగా పురాతన విగ్రహం కనిపించింది. ఈ విషయం గ్రామస్తులకు సమాచారం అందించడంతో వచ్చి పరిశీలించారు. ఇది అక్కన్న మాదన్న కాలం నాటిది కావొచ్చని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

టమాట.. ఢమాల్

కిలో 3 రూపాయలే!

అమాంతం పడిపోయిన ధర

దిగుబడి ఉన్నా రాని పెట్టుబడి

అప్పులపాలవుతున్న రైతులు

వివరాలు 7లో..



ఎండనక, వాననక ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న అన్నదాతకు ఈ ఏడాది కూడా కలిసి రాలేదు. తొలకరి వర్షాల కోసం రైతులు ఎదురు చూశారు. అప్పుడు కురవని వానలు అదును దాటాక వెంటాడాయి. దీంతో పత్తి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్ల ఉధృతి కారణంగా దిగుబడి పడిపోయి గిట్టుబాటు ధర దక్కక రైతుల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ధాన్యం అమ్ముకునేందుకు నానా కష్టాలు పడ్డారు. ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి కూడా ఇదే తీరుగా ఉంది. దీంతో చాలామంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

కలిసిరాని కాలం!

అనుకూలించని వాతావరణం

తలకిందులైన దిగుబడి అంచనాలు

తొలకరి కోసం తప్పని ఎదురుచూపు

సీజన్ ప్రారంభమైనా కురవని వర్షాలు

తర్వాత వదలని వానలతో దెబ్బతిన్న పంటలు

అధికంగా పాడైన పత్తి పంట

తేమ శాతంతో కొనుగోలుకు కొర్రీలు

ఏడాది పొడవునా రైతన్నకు నష్టాలు, కష్టాలు

సేకరించిన ధాన్యం (టన్నుల్లో)	
ఐకేపీ 462.920	పీఏసీఎస్ 4,779.720
డీసీఎంఎస్ 2,068.280	మొత్తం 7,310.920

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 27, (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారం నుంచి జిల్లాలో ఆరుతడి, మెట్ట పంటల సాగు ఆరంభమవుతుంది. కానీ మూడోవారం వరకూ వాన జాడ లేకుండా పోయింది. అవసరం లేనప్పుడు వరుణుడు తన ప్రతాపాన్ని చూపించి ముఖం చాటేశాడు. దుక్కులు దున్ని విత్తిన విత్తనాలు ఎండలకు వాడిపోయాయి. మరోసారి విత్తులు విత్తే పరిస్థితి ఏర్పడింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 94.0మి.మీ. కాగా, 68.5మి.మీ. మాత్రమే కురిసింది. -27.1 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జూలైలో 146.6 మిల్లీమీటర్ల వర్షం కురువాల్సి ఉండగా 145.3 కురిసింది. ఆగస్టులో 146.0 మిల్లీమీటర్లకు గాను 34.5 కురిసింది. రైతులు పత్తి విత్తనాలను విత్తుకున్నా వర్షాలు రాకపోవడంతో అవి మొలకెత్తలేదు. దీంతో రెండోసారి విత్తనాలు వేయాల్సి వచ్చింది. దీంతో వారిపై అదనపు భారం పడింది. పత్తి రైతుకు ఈసారి మిగతా 8వ పేజీలో...

బిందు, తుంపర సేద్యానికి కరువైన ప్రోత్సాహం

జిల్లాలో బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. ఈ పథకం మూడేళ్ల నుంచి అమలుకు నోచుకోవడం లేదు. బిందు సేద్యం ద్వారా సాగు గణనీయంగా పడిపోయింది. బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరాలు గడుస్తున్నా పరికరాలు అందకపోవడంతో పంటలకు నీళ్లందించేందుకు రైతన్నలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో మూడేళ్ల కాలంలో సుమారు 4,500 మంది రైతులు బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.



2004లో చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ (ఫైల్)

ఆలూరు నుంచే ‘ఉపాధి హామీ’ ప్రారంభం

జిల్లాతో మాజీ ప్రధానికి అనుబంధం

చేవెళ్ల, డిసెంబరు 27 (ఆంధ్యజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2004 సంవత్సరం నవంబర్ 14వ తేదీన ఆలూర్ నుంచే ఉపాధి హామీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. గురువారం రాత్రి తీవ్ర అనారోగ్యంతో మన్మోహన్ కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకుని ఆలూర్ గ్రామస్తులు దిగ్ర్భాంతికి గురయ్యారు. ఇరవై ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి సబితారెడ్డిలతో కలిసి దేశ ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ ఆలూర్ గ్రామానికి వచ్చారు. గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మిగతా 7వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎన్‌బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ చారి, కట్ట సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. ఆమనగల్లులో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాస్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, దుర్గా ప్రసాద్, శేఖర్ రెడ్డి, నరేందర్ రావు, గోరటి నర్సింహ్మా, లక్ష్మణ్, పాష, మన్యనాయక్, నర్సింహ్మా, పద్మ ప్రశాంత్, వెంకటేశ్, కుమార్, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

ధ్యాన మార్గం విశ్వశాంతికి దోహదం

» విశాఖ ఎంపీ శ్రీభరత్




ధ్యాన మహాయాగం వేడుకల్లో మాట్లాడుతున్న విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్

కడ్తాల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయుల ధ్యాన మార్గం విశ్వశాంతికి దోహద పడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ధ్యానం ద్వారా మానసిక ఒత్తిళ్లను అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మహేశ్వర మహాపిరమిడ్‌ను శుక్రవారం ఆయన సందర్శించి ధ్యాన గురువు సుభాష్ పత్రీజీకి నివాళులర్పించారు. విశాఖపట్నంలో ఇలాంటి పిరమిడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. మనసులోని వ్యతిరేక భావాలు, చెడు ఆలోచనలు తొలగిపోవడానికి ధ్యానం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.

అట్టహాసంగా కొనసాగుతున్న వేడుకలు

ధ్యాన మహాయాగం-3 వేడుకలను 7వ రోజు శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు పరిణతి పత్రీజీ, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంత రావు, మాధవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, పీఎస్‌ఎస్‌ఎం అధ్యక్షులు సరోజ, సంగమేశ్వర్, గణేశ్, దీప్తి, అనురాధ, మారం శివప్రసాద్, భాస్కరానంద, తదితరులు పాల్గొన్నారు.





బలహీన వర్గాల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట



టీడీపీ సభ్యత్వం ఇస్తున్న బక్కని నర్సింహులు

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి టీడీపీ చేసిన సేవలు నేటికీ మరుపురానివని, రెండు రాష్ట్రాలుగా విడిపోయినా పార్టీని స్థాపించినప్పటి నుంచి నేటి వరకు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తెలుగు దేశం పార్టీ పెద్దపీట వేస్తోందని పార్టీ రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సీనియర్ నాయకులు, కందుకూరు మాజీ సర్పంచ్ కొత్త నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బక్కని మాట్లాడారు. టీడీపీకి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజల నుంచి ఎంతో ఆదరాభిమానం ఉందని, మూడు జిల్లాలుగా ఏర్పడినా నేటికీ ప్రజలు పార్టీపై అభిమానం చూపుతున్నట్లు తెలిపారు. నగరశివారులో ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నేటికీ దర్శనమిస్తున్నాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా కీలకం కానున్నట్లు చెప్పారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు జి.పాండు, ఐలయ్య, గణపురం అంజయ్య, డి.బాల్‌రెడ్డి, బొమ్మకూరి మల్లేష్, ఎండీ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణలో అవినీతి!

భారీనష్టం జరిగాక మేల్కొన్న బల్దియా

- ఎమ్మెల్యేకు వివరించిన కమిషనర్
- నిబంధనలకు విరుద్ధంగా వేలంపై విమర్శలు
- నేడు మాంసాహార వ్యర్థాల సేకరణకు టెండర్లు





తాండూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ అధికారులు తాము ఏంచేసినా చెల్లుతుందనే భావనలో ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ ఆదాయానికి భారీనష్టం వాటిల్లినా నిబంధనలకు విరుద్ధంగా చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల టెండర్ వ్యవహారాన్ని తెరపైకి తేవడమే ఇందుకు కారణం. తాము చేసుకున్న ఒప్పందాలు బయటపడ్డాయని భావించిన సదరు అధికారి, పాలకవర్గం ఆగమేఘాల మీద 'బహిరంగ వేలం ప్రకటన'ను జారీచేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత వేలం రద్దు చేయకుండా మళ్లీ టెండర్

అధికారులు టెండర్ రద్దు ప్రకటన చేయకుండానే మళ్లీ టెండర్ ప్రక్రియ ఈనెల 18వ తేదీన తాజాగా టెండర్‌ను ప్రకటించారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో గత ఆగస్టు 18న నిర్వహించిన టెండర్‌ను రద్దుచేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, రఫీ టెండర్ దక్కించుకోవడానికి ముందే శంకర్‌సింగ్ కమిషనర్‌గా ఉన్న సమయంలో టెండర్ ప్రక్రియను చేపట్టారు. అప్పట్లో లిటిగేషన్ చరిత్ర, లిగల్ కేసులు ఉండరాదని అలాంటి వారికి అర్హత ఉండదని టెండర్ నోటిఫికేషన్‌లో ఇవ్వగా ఖురేషి ట్రేడర్స్‌పై ఉన్న కేసులను పేర్కొంటూ ప్రస్తుత చైర్‌పర్సన్ స్వప్నలిఖిత పూర్వకంగా అప్పట్లో ఫిర్యాదుచేశారు. ఆవివరాలు పెండింగ్‌లో ఉండగానే తిరిగి టెండర్ ప్రక్రియను చేపట్టడం విమర్శలకు దారితీస్తోంది. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తే అధికారుల బాగోతం బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

భారీ అవినీతి జరిగింది



తాండూరు మున్సిపాలిటీలో నాలుగున్నర సంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి, అక్రమాలకు ఈ చికెన్, మటన్ వ్యర్థాల టెండర్ నిదర్శనం. ఈ టెండర్ ప్రక్రియలో అధికారులు, చైర్‌పర్సన్ కుమ్మక్కైయ్యారు. అవినీతి జరిగాక టెండర్ వేయడం హాస్యాస్పదం. ఆదాయాన్ని పెంచాల్సిన అధికారులు, చైర్‌పర్సన్ అవినితికి పాల్పడుతున్నారు. గతంలో వేసిన టెండర్ ఎందుకు రద్దు చేశారో చెప్పకుండానే తిరిగి టెండర్ వేయడమేంటి?

- సాంబుర్ సోమశేఖర్, కౌన్సిలర్, తాండూరు

ఎమ్మెల్యే దృష్టికి మామూళ్ల వ్యవహారం

చికెన్, మటన్ వ్యర్థాల సేకరణకు టెండర్లు వేసిన తర్వాత కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో తిరిగి రీటెండర్ వేయకుండా కొన్నినెలల పాటు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వ్యర్థాలసేకరణ చేపట్టారు. ఈ వ్యవహారంపై స్వయంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌చేసి నిలదీశారు. టెండర్లలో భారీ అవినీతి చోటుచేసుకుందని ఎమ్మెల్యే వద్ద స్వయంగా మున్సిపల్ కమిషనరే అవినీతి చిట్టాను బయటపెట్టడం గమనార్హం. మామూళ్ల వ్యవహారం అటు పాలకవర్గం ఇటు అధికార యంత్రాంగం పరస్పర ఆరోపణలు చేసుకొని ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేసుకునే వరకు వెళ్లింది. దీంతో సీరియస్ అయిన ఎమ్మెల్యే వెంటనే టెండర్లు వేసి నిబంధనల ప్రకారం కొనసాగించాలని ఆదేశించారు.

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి



జూలై 2వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం

జూలై 2వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ష్... వేలం వట్టిదేనా..?' అనే శీర్షికన చికెన్, మటన్ వ్యర్థాలకు సంబంధించి తాండూరు మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతున్న విషయాన్ని వివరిస్తూ కథనాన్ని ప్రచురితమైంది. ఆ వెంటనే అధికారులు స్పందించి ఉంటే మున్సిపాలిటీకి భారీ ఆదాయం సమకూరేది. గత ఆగస్టు 18వ తేదీన మున్సిపాలిటీలో చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల సేకరణకు నిర్వహించిన టెండర్‌ను కొడంగల్ పట్టణానికి చెందిన ఎండీ రఫీ రూ.30లక్షల 65వేలకు దక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం ఏడు రోజుల్లో వేలం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇంత వరకు వేలం డబ్బును వసూలు చేయలేదు. దీంతో అంతకుముందు టెండర్ దక్కించుకున్న ఖురేషి ట్రేడర్స్‌కే వ్యర్థాల సేకరణకు అనుమతించారు. నిబంధనల ప్రకారం సకాలంలో చెల్లింపులు చేయని యేడల దరావత్ సొమ్ము జప్తు చేసుకుని తిరిగివేలం నిర్వహించాల్సివుంది. అయితే నాలుగు నెలలుగా నాన్చుడు ధోరణి వ్యవహరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఖురేషి ట్రేడర్స్ నుంచి ముడుపులు ముట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ టెండర్‌ను ప్రక్రియను చేపట్టారు. మున్సిపాలిటీ ఆదాయానికి లక్షల్లో నష్టం వాటిల్లినా మళ్లీ టెండర్‌కు వెళ్లడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది.

సనాతన ధర్మానికి ఆలయాలు ప్రతీకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీఎన్‌మూర్తి, శ్రీదేవి, వర, ప్రసాద్ తదితరులు

కీసర రూరల్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి ప్రతీకలుగా దేవాలయాలు నిలుస్తున్నాయని ప్రముఖ రచయిత ముళ్లపుడి వెంకటరమణ సతీమణి శ్రీదేవి అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రజాసాయిగార్డెన్‌లోని ఆలయ నిర్వహణ కార్యదర్శి వేదుల రాంచంద్రరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీంతోపాటు త్రిమూర్త్యాత్మక మూల విరాట్టులపై బీఎస్ మూర్తి చేసిన రచన, గాయకుడు సాత్విక్ గానం చేయగా, ముళ్లపుడి వెంకటరమణ సోదరుని కుమారుడు ప్రసాద్ నిర్మించిన వీడియో సాంగ్‌ను, ఆలయ పైకప్పుపైన శ్రీరాముని పట్టాభిషేక ఘట్టాన్ని వివరించే విధంగా కళాకారుడు కడలి సురేశ్ చిత్రీకరించిన దృశ్య చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ నగరానికి చేరువలో, ప్రకృతి ఒడిలో, పచ్చదనంతో కనువిందు చేస్తున్న దేవాలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతుందన్నారు. ఈ సందర్భంగా రచయిత, కార్టూనిస్టు బీఎస్‌మూర్తి మాట్లాడుతూ తిమూరత్యాత్మ దేవాలయంపై భక్తి గీతం రచించటం సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్వహక కార్యదర్శి రాంచంద్రరావు మాట్లాడుతూ ఆలయంలో నిత్యం వేద మంత్రోశ్చరణతో శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించబడుతుందన్నారు. అనంతరం వారందరికీ వేద మంత్రాలతో ఆశీర్వచనం అందజేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సీనియర్ జర్నలిస్టు చాగంటి మూర్తి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తాండూరు టౌన్ సీఐ సంతోష్‌కుమార్

తాండూరు రూరల్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తాండూరు టౌన్ సీఐ సంతోష్ కుమార్ అన్నారు. మండలలోని ఖాంజాపూర్ గ్రామంలో శుక్రవారం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలు అధికమయ్యాయన్నారు. అమాయ కులకు టోకరా వేసి వారి అకౌంట్‌లో నుంచి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. అలాంటి నేరాలనే తిప్పికొట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ కళాబృందంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామ దేవతలకు ఎన్ని సంవత్సరాలకు ఒకసారి జాతర నిర్వహిస్తారు, ఏయే కమిటీ వారు ఎంతమంది ఉన్నారు, సర్పంచ్‌లుగా ఎవరు విధులు నిర్వహించారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రజలు కులమతాలకతీతంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామం నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సాయప్ప, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎల్‌సీఏ కో ఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్

వికారాబాద్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని ఎస్ఎల్‌సీఏ కో ఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్ అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, మద్యపానం వినియోగాన్ని తగ్గించేందుకు వికారాబాద్ కలెక్టర్ భవన సముదాయంలోని మహిళా సమైక్య మీటింగ్ హాల్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్ ఏజెన్సీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని తెలిపారు. దీన్ని తగ్గించేందుకు మాస్టర్ వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేయాలన్నారు. మత్తుకు బానిసలైన వ్యక్తులను డీఅడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని సూచించారు. ఈకార్యక్రమంతో మత్తుకు బానిసలైన వారిని సాధారణ జీవనం గడిపేలా అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సీడీపీవో రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశమ్మ, శాంత, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం.వెంకటేశ్, పులిందర్, మధు పాల్గొన్నారు.

కూలీల కొరత.. నేల రాలుతున్న పత్తి



కొందుర్గు: పొలంలో నేలరాలుతున్న తెల్ల బంగారం

పత్తి రైతులకు ప్రతీ సంవత్సరం కష్టాలు తప్పడం లేదు. విత్తనం నాటిన నుంచి పంట విక్రయం వరకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చేతికొచ్చిన పంటను తీయడానికి రైతులను కూలీలను కొరత వేధిస్తోంది. కూలీలు దొరకక పొలంలోనే పత్తి రాలపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట ఒకేసారి చేతికి రాడంతో స్థానికంగా కూలీలకు డిమాండ్ పెరిగింది. రవాణా చార్జీలు పోను ఇతర ఖర్చులు పోను రోజుకు 400 నుంచి 600 డిమాండ్ చేస్తున్నారు. అయిన కూలీలు దొరకపోవడంతో పత్తి చెనులోనే నేలరాలిపోతుందని రైతులు వాపోతున్నారు. చేసేదేమి లేక రైతుల కూలీలకు అధిక ధర చేల్లించి తీసుకువస్తున్నారు. దీంతో ఖర్చులు పెరిగి పెట్టుబడి కూడా వెళ్తుందో లేదోనని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

- చౌదరిగూడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


సావనీరు విడుదల చేస్తున్న అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన ఏయూ ఫార్మాకాన్-2024 అంతర్జాతీ సదస్సు నిర్వహించి సావనీరు విడుదల చేశారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదుస్సుల్లో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు వసుధభక్తి, రామకృష్ణ, మఖేష్ కుమార్, కృష్ణప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు


వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

కొడంగల్ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్సాపూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన వానరానికి గ్రామస్థులు, హిందూవాహిని సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం పక్కనే మృతిచెందిన వానరాన్ని చూసి గ్రామస్థులు ట్రాక్టర్‌లో వానరాన్ని ఉంచి అంతిమయాత్రతో గ్రామశివారులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్‌సింగ్‌ది కీలక పాత్ర


విఠల్

వికారాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర పోషించారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీజీపీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్ కొనియాడారు. తెలంగాణ ఏర్పాటుకు ఆయనే శ్రీకారం చుట్టారని, తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ ఆయన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన ఆయన ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ఆకాంక్షను సాకారం చేశారని ఆయన అన్నారు. రాష్ట్ర సాధన కోసం తాము జేఏసీ తరఫున ఎప్పుడు వెళ్లినా సానుకూలంగానే స్పందించారన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన అసామాన్య విజయాలు సాధించిన మహా జ్ఞాని అన్నారు. మన్మోహన్‌సింగ్ రాజకీయ వేత్త కాదని, ఆయన ఒక ఆర్థిక శాస్త్రవేత్త అన్నారు. రాజకీయేతర వ్యక్తి దేశానికి ప్రధాన మంత్రి అయితే పాలన ఏవిధంగా ఉంటుందో నిరూపించిన మహనీయుడని గుర్తు చేశారు. ఆర్థిక మంత్రిగా దేశ వ్యవస్థలను సరళీకృతం చేశారని అన్నారు. దేశ రాజకీయాల్లో హక్కుల ఆధారిత విధానాన్ని అనుసరించడం వల్ల కొత్త శకానికి నాంది పలికారని కొనియాడారు.

మాజీ ప్రధానికి చిత్రకారుడి నివాళి


చిత్రలేఖనం ద్వారా మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న చిత్రకారుడు సున్నపు అశోక్

దౌల్తాబాద్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు సున్నపు అశోక్ తన కళా నైపుణ్యంతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాన్ని గీసి నివాళులర్పించాడు. అదేవిధంగా మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావ్, బోడివెంకట్ రెడ్డి, వీరన్న, వెంకట్రాములు, మార్కెట్ కమిటీ సభ్యులు కోటం రాములు, నర్సింహులు, సేవ్యనాయక్ పాల్గొన్నారు.

రామన్నగూడను మున్సిపాలిటీలో కలపొద్దు


సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రామన్నగూడ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని గ్రామస్థులు కోరారు. ఈమేరకు శుక్రవారం గ్రామస్థులు, పలువురు నాయకులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, యువ నాయకుడు దయాకర్, మోహన్, మహేందర్ పలువురు నాయకులతో కలిసి గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నగూడ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే గ్రామం అభివృద్ధిలో వెనుకబడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సబితారెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం.. ఆసుపత్రికి తరలింపు


శిశువును బంధువుకు అందిస్తున్న ఈఎంటీ సాయికృష్ణ

కేశంపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. మండల పరిధిలోని బొదునంపల్లికి చెందిన ఆంజనేయులు భార్య రమ్య నిండు గర్భిణి. ఆమెకు పురిటినొప్పులు రావడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు కేశంపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వైద్యులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపన్‌లు అంబులెన్స్‌తో ఆసుపత్రికి చేరుకొని రమ్యను షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గుట్ట సమీపంలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో ఈఎంటీ డెలివరీ చేశాడు. రమ్య మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బందిని బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు.

ధర్మన్నగూడలో పాడైన టమాట తోట



టమాట.. ధమాల్

కిలో మూడు రూపాయలే!

- అమాంతం పడిపోయిన ధర
- కూలీల ఖర్చులకు కూడా సరిపోని వైనం
- దిగుబడి ఉన్నా రాని పెట్టుబడి సొమ్ము
- అప్పులపాలవుతున్న టమాట రైతులు

యాచారం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): టమాట ధర రోజురోజుకూ పడిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన మోస్తరు వర్షం కారణంగా కూరగాయల తోటలన్నీ దెబ్బతిన్నాయి. మెట్ట పంటగా సాగు చేసిన టమాట తోటను చాలాచోట్ల రైతులు డ్రిప్‌ల సాయంతో సాగుచేశారు. కాగా, పంట చేతికొచ్చే సమయానికి ధర పడిపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. మార్కెట్లో కిలో టమాట కిలో ధర రూ.3 పలుకుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు రూ.2.50కే విక్రయిస్తుండటం గమనార్హం. పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, ధర్మన్నగూడ, నజ్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో రైతులు టమాట సాగుచేసి తీవ్రంగా నష్టపోయినట్లు అక్కడి రైతులు వాపోతున్నారు. టమాటాలను తెంపడానికి కూలీలకయ్యే ఖర్చుతో పాటు నగరానికి, ఇతర ప్రాంతాలకు తరలించడానికి వాహనాలకు కిరాయి చెల్లించాల్సి ఉంటుంది. దాంతో చేతికందిన డబ్బులో రూపాయి కూడా మిగలడం లేదని రైతులు వాపోతున్నారు. సంక్రాంతికి నెలరోజుల ముందు టమాట ధర కాస్త ఎక్కువగా ఉండటంతో చేతినిండా డబ్బు ఉండేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం ధర పడిపోవడంతో పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే అవకాశం లేదని, అప్పులపాలవుతున్నామని రైతులు చెబుతున్నారు.

తెంచకుండానే వదిలేస్తూ..

యాచారం మండలంలోని వివిధ గ్రామాల్లో 345 ఎకరాల్లో టమాట సాగు చేశారు. అయితే, పంటకు తెగుళ్లతో పాటు వర్షాల కారణంగా 132 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. టమాట దిగుబడి ఆశించినంతగా ఉన్నా.. ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమాట ధర రూ.5 పలుకుతుండటంతో కనీసం కూలీల ఖర్చులకు కూడా సరిపోవడం లేదని చెబుతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.500 చెల్లిస్తున్నామని వాపోతున్నారు. కాగా, పలువురు రైతులు ఖర్చులు కూడా రావడం లేదని తోటలోనే పంటను వదిలేస్తున్నట్లు తెలిపారు. కనీసం కిలోన్నర టమాటాలను కుప్పగా పెట్టి గ్రామాల్లో రూ.20కే విక్రయిస్తున్నామని చెబుతున్నారు.

టమాట రైతులను ఆదుకోవాలి



టమాట ధర ఇంత దారుణంగా పడిపోవడం ఏనాడూ చూడలేదు. కిలో టమాట కనీసం రూ.10 పలికితేనే గిట్టుబాటు అవుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా పడిపోవడంతో కూలీలకయ్యే ఖర్చులు కూడా వెళ్లడం లేదు. పైగా పెట్టుబడికి అప్పులు తెచ్చాం.. ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం టమాట రైతులకు ఆదుకోవాలి.

- శేఖర్, రైతు, నజ్దిక్‌సింగారం

పశులవు మేతగా టమాటాలు



టమాటకు ధర లేకపోవడంతో పంటకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఎకరా సాగుకు రూ. 24వేలు ఖర్చు చేశాను. కిలో టమాటకు కనీసం రూ. 25ఉంటే కాస్త గిట్టుబాటవుతుంది. తోటలో టమాటాలు ఏరడానికి రోజుకు రూ.450 తీసుకుంటారు. ఇప్పుడు టమాట కిలో రూ.3 ఉండడంతో ఏం చేయలో తోచడం లేదు. టమాటను మార్కెట్‌కు తరలించడం కంటే పశువులకు మేతగా వేసుకుంటే మంచిది అనిపిస్తుంది.

- బైకని మల్లేష్, రైతు కుర్మిద్ద

పెట్టుబడి కూడా రావడం లేదు



ఒక్క మొక్క కోసం రూపాయిన్నర ఖర్చు చేసి నారు తెచ్చి నాటిన. మూడెకరాలలో నారు నాటడానికి రూ.12వేలు వెచ్చించిన. నారు కోసం రూ.21 వేలు ఖర్చుచేసినాను. టమాట ధర లేకపోవడంతో చేసిన ఖర్చు కూడా చేతికందే పరిస్థితిలేదు. కిలో టమాట కనీసం రూ.25వరకుంటే గిట్టుబాటవుతుంది. తెగులు నివారణ కోసం రూ.10 వేలు వ్యయమైంది. నారు నాటడం, నారు తేవడానికైన ఖర్చులు, టమాట తెంపడానికైన వ్యయం ఇవన్నీ లెక్క పెడితే అప్పులే మిగులుతున్నవి.

- కలకొండ బీరప్ప, మేడిపల్లి రైతు

పాడి పరిశ్రమాభివృద్ధికి తోడ్పాటు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


పాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ తోడ్పాటునందిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమను చేపట్టిన ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రాన్ని శుక్రవారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. కూలింగ్ ప్లాంట్లను, యంత్రాలు, పరిసరాలు, రికార్డులు, పాల నాణ్యతను పరిశీలించారు. కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం ద్వారా 30 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందని అధికారులు ఎమ్మెల్యే కు తెలిపారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, యంత్రాలు తుప్పు పట్టాయని, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, పాడి రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మూడు పక్షాల పాల బిల్లులు రాలేదని, త్వరగా ఇప్పించాలని కోరారు. పాడి రైతుల సమస్యలు, పెండింగ్ బిల్లులు, నూతన భవనాల నిర్మాణం గురించి సీఎం, పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ ఛైర్మన్ అమిత్‌రెడ్డిల దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే చెప్పారు. బీచ్యానాయక్, హన్మనాయక్, చందోజీ, కృష్ణ, లక్‌పతి నాయక్, మల్లేశ్‌గౌడ్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ గౌడ్, సత్యం యాదవ్, జహంగీర్‌అలీ, బిక్షపతి, యాదయ్య గౌడ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు నుంచే ఉపాధి హామీ ప్రారంభం

(5వ పేజీ తరువాయి)


2004 సంవత్సరంలో చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ వేసిన శిలాఫలకం వద్ద అప్పటి ప్రజాప్రతినిధులు

ఈ గ్రామంలోనే అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. బహిరంగ సభ నిర్వహించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అప్పుడు వేసిన మన్మోహన్‌సింగ్ వేసిన శిలాఫలకం ఇప్పటికీ ఉంది.

మన్మోహసింగ్‌ను సన్మానించిన అప్పటి ఆలూరు సర్పంచ్

ఆలూరు గ్రామానికి వచ్చిన ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను అప్పటి ఆలూరు గ్రామ సర్పంచ్ సక్కుబాయి, ఎంపీటీసీ తమ్మగోని లక్ష్మి వేదికపై శాలువాలతో సన్మానించారు. అనంతరం మెమోంటోను అందజేశారు. మన్మోహన్‌సింగ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న వీరు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

దేశానికి తీరని లోటు



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటు. దేశంలోని పేదలందరికీ ఉపయోగపడే ఉపాధి హామీ పథకాన్ని ఆలూర్ నుంచి ప్రారంభించిన జ్ఞాపకాలు ఇప్పటికే కళ్లల్లో మెదులుతున్నాయి. వేదికపై సర్పంచ్‌గా ఆయన పక్కన నేను కూర్చోవడం చాలా గౌరవంగా ఉంది. దేశం ఒక గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది.

- సక్కుబాయి, ఆలూరు గ్రామ మాజీ సర్పంచ్

ఆలూరుకు రావడం మరిచిపోలేనిది



దేశ ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ ఆలూర్ గ్రామానికి రావడం చాలా గొప్పవిషయం. ఇక్కడి నుంచి ఉపాధి హామీ పథకం ప్రారంభించడం మరిచిపోలేనిది. అప్పుడు ఎంపీటీసీగా ఉండటంతో నాకు మన్మోహన్‌సింగ్‌ను కలిసే భాగ్యం కలిగింది. ఆయన మరణం చాలా బాధాకరం.

- తమ్మగోని లక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఆలూరు

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు అవసరం

వేరుశనగ పంటను పరిశీలించిన డీఏవో మోహన్‌రెడ్డి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

బొంరాస్‌పేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై జాగ్రత్తలు పాటించి ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని ఈర్లపల్లి, దుద్యాల్, బొంరాస్‌పేట్ గ్రామాల్లో వేరుశనగ పంటను పరిశీలించారు. ఆయనతో పాటు వ్యవసాయ అధికారులు తులసి, మాణికేశ్వరి వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో టిక్కా ఆకుమచ్చ తెగులు ఆశించేందుకు అవకాశం ఉంటుందని, దీని నివారణకు 1.0 మిల్లీ లీటచర్ల టేబ్యుకోనజోల్ లేదా 2 గ్రాముల క్లోరోథాలోనిల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొవ్వు కుళ్లు వైరస్ వ్యాప్తి చెందకుండా నివారణకు 5 గ్రాముల థయోమిథాక్సీమ్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మొదలు కుళ్లు తెగులు ఆశించకుండా నివారణకు 2 గ్రాముల కార్బండజీమ్, మాంకోజెబ్ మిశ్రమ మందును లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ల దగ్గర నేల తడిచేటట్లు పిచికారీ చేయాలన్నారు. పొగాకు లద్దె పురుగు నివారణకు జిల్లెడ ఆకులు ఏరి పురుగులను నాశనం చేయాలన్నారు. ఎకరానికి 10-15 పక్షి స్థావరాలను ఏర్పర్చుకోవాలన్నారు. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలన్నారు. ఎదిగిన లార్వా నివారణకు 1 మిల్లీ నోవాల్యూరాన్ లేదా 2 మిల్లీ ఫ్లూబెండమైడ్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారా చేయాలని సూచించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ సుధాకర్‌రావు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుధాకర్‌రావు

శామీర్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో సీఎం కప్- 2024 రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని ఫుట్‌బాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు గర్ల్స్ (బాలికలకు)కు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 450 మంది క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్‌బోస్, కోచ్‌లు నిర్వహించారు.

దివ్యాంగులను ఆదరించండి


నల్లవెల్లిలో బస్‌పాస్‌లు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతి గౌడ్

యాచారం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి జీవనం సాగిస్తున్న దివ్యాంగులను ఆదరించాలని, మానవత్వంతో వారిని ఆదుకోవాలని యాచారం మండలంలోని నల్లవెల్లి మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని 65మంది దివ్యాంగులకు తన సొంత డబ్బుతో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను చీదరించుకోవడమంటే పాపాలను మూటగట్టుకోవడమే అవుతుందన్నారు. నగరంలోని దిల్‌సుఖ్‌నగర్ వెళ్లలేరని దివ్యాంగుల వివరాలను ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి రప్పించి బస్‌పాస్‌లు అందిస్తున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 57వ రోజుకు చేరాయి. దీక్షలో స్థానిక నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి అన్ని విధాల అనుకూలంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. మూడు దశలుగా దీక్షలు చేస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు తెలిపారు. మండల కేంద్రం ఏర్పాటు గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి స్పందించకుంటే కల్వకుర్తి పట్టణంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు అంజనేయులు గౌడ్, కృష్ణ, మహేశ్, శేషనాయక్, అల్లావుద్దీన్, అంజనేయులు, ఎండీ గౌస్, మాణిక్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు చెక్కు ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కళాశాల నిర్మాణానికి భూరి విరాళం

షాద్‌నగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శుక్రవారం శతాబ్ది టౌన్‌షిప్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి రూ.11లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. తాను ప్రభుత్వ జూనియర్ కళాశాలోనే ఇంటర్ విద్యను పూర్తిచేసానని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న కళాశాలను ఎమ్మెల్యే శంకర్ దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం చేపడుతుండటం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం దాతలు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున ఆర్థిక సహకారం అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు.

కేటీఆర్‌ను కలిసిన అవినాశ్‌రెడ్డి



షాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తన జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాశ్‌రెడ్డి శుక్రవారం కేటీఆర్, హరీశ్‌రావు, పట్లోళ్ల సబితారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా షాబాద్, చేవెళ్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు అవినాశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కలిసిరాని కాలం..!

(5వ పేజీ తరువాయి)

కూడా కష్టాలు తప్పలేదు. పెట్టుబడి, శ్రమకు తగ్గ ఫలితం దక్కలేదు. పంట చేతికొచ్చాక సీసీఐ విధించిన ఆంక్షలకు ఆగమయ్యారు. 8-12 శాతం తేమ కలిగిన పత్తి మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనలతో ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది కురిసిన వర్షాలు కూడా పత్తి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. పత్తి కాయ రంగు మారి దిగుబడి తగ్గింది. తేమ శాతంతో పాటు పత్తిలో కాయ వస్తోందని, రంగు మారిందని సీసీఐ అధికారులు సాకులు చెబుతూ క్వింటాలు పత్తికి మద్దతు ధరలో రూ.70 నుంచి రూ.100 వరకు తగ్గించేశారు.

నకిలీలతో నష్టాలు..

ప్రతీ ఏడాది రైతులకు నకిలీ బెడద తప్పడం లేదు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై వ్యవసాయాధికారులు దాడులు నిర్వహిస్తున్నా వ్యాపారులు ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. నకిలీ పత్తి విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా రైతులకు అంటగడుతున్నారు. కొందరు రైతులు వీటిని కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారు.

రైతుకు 'భరోసా'

జిల్లాలో యాసంగి 2024 సీజన్‌కు రైతు భరోసా పథకం కింద 3,25,217 మంది రైతుల ఖాతాల్లోకి రూ.343.11 కోట్లు జమ చేశారు. అలాగే రైతు బీమా' పథకం ద్వారా జిల్లాలో డిసెంబర్ 2023 నుంచి ఆగస్టు వరకు 653 రైతుల మరణాలు నమోదు కాగా, మొత్తం రూ.32.65 కోట్లు రైతుల నామిని ఖాతాలలో జమ చేసి రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించింది.

గతేడాది, ఈసారి సాగైన పంటల వివరాలు

పంట	యాసంగి 2023-24లో సాగైన విస్తీర్ణం(ఎకరాల్లో)	యాసంగి 2023-25 సాగు అంచనా విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1,13,341	1,00,256
జొన్న	2,116	1,113
మొక్కజొన్న	10,007	7,020
శనగ	1,485	2,801
వేరుశనగ	6,928	6,731



వానాకాలం-2024 ధాన్యం కొనుగోలు వివరాలు

కొనుగోలు కేంద్రాలు	42
ఐకేపీ	03
పీఏసీఎస్	31
డీసీఎంఎస్	08
సేకరించిన ధాన్యం	7,310.920 మెట్రిక్ టన్నులు
రైతులు	1,504
గ్రేడ్-ఎ	7,285.720 మెట్రిక్ టన్నులు
కామన్ రకం	25.200 మెట్రిక్ టన్నులు



మద్దతు ధర...

సాధారణ రకం	2,300
గ్రేడ్ ఏ-రకం	2,320
సన్నాలకు బోనస్	500
పత్తి కొనుగోలు కేంద్రాలు	14

మద్దతు ధర...

మధ్యరకం పింజ	7121
పొడుగు పింజ	7521



క్రైం కార్నర్

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

చేవెళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఎదెరెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లికి చెందిన మల్గాని రాజమల్లయ్య (55) శుక్రవారం పని నిమిత్తం చేవెళ్ల మండల కేంద్రానికి వచ్చి తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. చేవెళ్ల మండల పరిధిలోని ఇక్కరెడ్డిగూడ గ్రామానికి చెందిన పి.రామస్వామి, భార్య మాధవిలు బైక్‌పై వికారాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో ఖానాపూర్-మీర్జాగూడ స్టేజీల మధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రాజమల్లయ్య తలకు రక్తగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పి.రామస్వామి, భార్య మాధవిలు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అంబులెన్స్‌లో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఆర్థికసాయం అందిస్తున్న జైపాల్ యాదవ్

కడ్తాల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సాలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ శుక్రవారంలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈమేరకు ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని జైపాల్ యాదవ్ బాధిత కుటుంబానికి అందజేశారు. పీఏసీఎప్ డైరెక్టర్ జోగు వీరయ్య, నాయకులు మంగళపల్లి నర్సింహ, లాయక్ అలీ, పాండు, సురేశ్, బిక్షపతి, రాజు, శ్రీకాంత్, జంగయ్య, తదితరుల ఉన్నారు. అలాగే డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి సాలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. రూ.5వేల ఆర్థికసాయం చేశారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, జగన్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, సేవాదల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

- ప్రజాప్రతినిధులు. నాయకులు
- మాజీ ప్రధాని మృతి పట్ల ఘన నివాళి

కడ్తాల్/ఆమనగల్లు/యాచారం/మంచాల/షాబాద్/ఆదిభట్ల/షాద్‌నగర్/కొత్తూర్/కందుకూరు/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల/శంషాబాద్/కేశంపేట/శంషాబాద్ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆధునిక భారత ఆర్థిక రూపశిల్పి, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే, నాయకులతో కలిసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ



చేవెళ్ల : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు. ఆమనగల్లు మండలం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, జగన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇబ్రహీంపట్నం ఏఎంసీ డైరెక్టర్, కాంగ్రెస్ యాచారం మండలాధ్యక్షుడు నర్సింహ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి ఏఎంసీ డైరెక్టర్ ఎండీ అక్బర్, భట్టు శ్రీనివాస్, వెంకటరెడ్డిలతో కలిసి



ఆమనగల్లు : మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి మంచాలలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. జాపాలలో ఆవుల మల్లేష్, మంచాలలో విష్ణువర్ధన్‌రెడ్డి, సాతిరి ఎల్లేష్, ఆనంగళ్లయాదయ్య, తదితరులు నివాళులర్పించారు. కాంగ్రెస్ యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నివాళులర్పించారు. చైర్‌పర్సన్ స్రవంతి, వైస్‌చైర్మన్ మంగ, గడ్డిఅన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు మధుసూదన్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, తదితరులున్నారు. మన్మోహన్ చిత్రపటానికి ఆదిభట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్ చౌరస్తా, ఎంపీపటేల్‌గూడలో నాయకులు నివాళులర్పించారు. వైస్ చైర్మన్ యాదగిరి తదితరులన్నారు. ఎంపీపటేల్‌గూడ మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, తదితరులున్నారు. కాంగ్రెస్ షాబాద్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీలు రవీందర్, చెన్నయ్య, అశోక్, తదితరులున్నారు. కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి చేవెళ్ల మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీసీసీ సహాయ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, తదితరులున్నారు. కాంగ్రెస్ కొత్తూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో చౌరస్తా వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. హరినాథ్‌రెడ్డి, జనార్దన్‌చారి, సురేందర్, శివశంకర్, చిల్కమర్రి నర్సింహ, తదితరులున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ పట్టణ కూడలిలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. చెల్లా శ్రీకాంత్‌రెడ్డి, రఘు, బాబర్‌ఖాన్, అగ్గనూరు విశ్వం, తదితరులున్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కందుకూరు మాజీ జడ్పీటీసీలు జంగారెడ్డి, జంగారెడ్డిలు మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్‌పై మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులున్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జ్ఞానేశ్వర్, జె.నరేందర్, పాల్గొన్నారు. మన్మోహన్ సేవలు చిరస్మరణీయమని కేశంపేట మండలాధ్యక్షుడు వీరేశ్ అన్నారు. మండల కేంద్రంలో చిత్రపటానికి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, రాములు, సురేష్ మాదిగ, ఆనంద్ రెడ్డి, పెంటయ్య, తదితరులున్నారు. శంషాబాద్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గడ్డం శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌లు నివాళులర్పించారు. కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, తాజ్‌బాబా, శేఖర్, నర్సింగ్‌రావు, నజీర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ : పోచమ్మ తల్లి ఆలయం వద్ద పూజల్లో గ్రామస్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు

చౌదరిగూడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లిలో గ్రామస్తులు పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ యాదమ్మ పాల్గొని పోచమ్మ తల్లికి పట్టు వస్త్రాలను సమర్పించి ఒడిబియ్యం పోసి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా బండ్లు తిప్పే కార్యక్రమం

కేశంపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గట్టుపై వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బండ్లు తిప్పుట కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీని ఆయన అభినందించారు. భక్తులకు చేసిన ఏర్పాట్లను ఆయన కొనియాడారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాజీ సర్పంచ్ మంజులామల్లేష్, వైస్ ఎంపీపీ అనురాధ పర్వత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం గౌడ్, తోట ఆంజనేయులు, శేఖర్ పంతులు, నాగిళ్ల వెంకటేష్, చిర్ర రాజు, చిన్న నర్సింలు, చిర్ర చంద్రయ్య, అశోక్ రెడ్డి, జంగయ్య, నరేందర్ రెడ్డి, శ్రీను, రవి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, రమేష్, కరుణాకర్ రెడ్డి, నాగేష్, గిరిధర్ యాదవ్, మనోహర్‌గౌడ్, రాఘవేందర్, ఆనంద్ రెడ్డి, రమేష్, రాజు, జగన్ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కేశంపేట : కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

కొత్తూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నాట్కో ఫార్మా మజ్దూర్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీ రఘునందన్‌రావు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్మికులకు బీజేపీ అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ రఘునందన్‌రావు హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.శ్రీవర్ధన్‌రెడ్డి, కార్మిక నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, శ్రీను, నర్సింహ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీవి మత రాజకీయాలు'

మహేశ్వరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు అన్నారు. దేశంలో దళితులపై, మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆయన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ 6వ మండల మహాసభ నిర్వహించారు. రాజు మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగంపై విధ్వంసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఆశల పల్లకీలో ఊరేగిస్తుందన్నారు. 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం సీపీఐ(ఎం) మహేశ్వరం మండల కార్యదర్శిగా ఏర్పుల శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అలువాల రవికుమార్, కవిత, ప్రకాష్, జగన్, జంగయ్య, చంద్రయ్య, మల్లేష్, శ్రీశైలం, శైలజ, లక్ష్మి, తదితరులున్నారు.



నియామకపత్రం అందజేస్తున్న రాము

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

షాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు కలిసికట్టుగా పనిచేస్తూ సత్తాచాటి బీజేపీ జెండాను ఎగురవేద్దామని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చర్లగూడలో 204, రుద్రారం బూత్‌లో 234 బూత్ కమిటీలు వేశారు. చర్లగూడ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ముత్యంరెడ్డి, రుద్రారంనకు రాఘవేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి చేరేవిధంగా చూడాలన్నారు. నాయకులు విజయ్‌కుమార్, శివకుమార్, సాయికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సందీప్, అరుణ్, వెంకటయ్య, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి నాయకుల పరామర్శ



అమర్‌సింగ్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్ గౌడ్

కడ్తాల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన అమర్‌సింగ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు బీచ్యనాయక్, జగన్‌లు శుక్రవారం అమర్‌సింగ్‌ను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హీరాసింగ్, జవహర్‌లాల్ నాయక్, స్టాలిన్ కిషన్, తులసీరామ్ నాయక్, రాము, గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యాచారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మలోనిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని చింతపట్ల ఫీడర్ పరిధిలో, నందివనపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతులతో పాటు వైర్ల కింద ఉన్న చెట్లను నరికివేత పనులు చేస్తుండడంత విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం : సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ సీహెచ్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంకోసం గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో చేపట్టిన టోకెన్ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. అర్హులైన కారోబార్, బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

తలకొండపల్లి : పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు హాజరయ్యారు. పాండు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులకు నెలల కాలంగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించామన్నారు. మల్టీపర్పస్ విధానంలో పనిచేస్తున్న దాదాపు వంద మంది కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలు వీధినపడ్డాయని అన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు ఏరియా కన్వీనర్ పెంటయ్య, యూనియన్ మండల అధ్యక్షుడు బుర్ర జంగయ్య, బేగరి యాదమ్మ, రాములు,పాండు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు నిరసన ర్యాలీని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ 40ఏళ్లుగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఆరోపించారు. అనంతరం మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు అనేగౌని బాల్‌రాజ్‌గౌడ్, యాదయ్య, నర్సింహ, హరికృష్ణ, శ్రీధర్‌రెడ్డి, అనిల్, అంజయ్య, యాదయ్య, గణేష్, యశోధ, జయ్యమ్మ, కళమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న బాల్‌రాజ్

బాధిత కుటుంబాలకు సబితా ఇంద్రారెడ్డి ఓదార్పు



యాదగిరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లపల్లికి చెందిన జి.యాదగిరి రోడ్డు ప్రమాదంలో మరణించడం బీఆర్ఎస్‌కు తీరని లోటని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఊట్లపల్లికి వెళ్లి యాదగిరి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం దాసర్లపల్లికి చెందిన శ్రీగాది శంకరయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని, వారు పార్టీకి చేసిన సేవలు మరువురానివని గుర్తు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు జె.కర్నాకర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహరెడ్డి, టి.దేవేందర్, పి.అశోక్, టి.ఇందిర, ఆనంద్, సహకార సంఘం డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి ఆలయానికి భారీగా ఆదాయం

- కొబ్బరి చిప్పలు, వడిబియ్యం, చీరలు సేకరించే హక్కులకు వేలం



మైసిగండి మైసమ్మ దేవాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కడ్తాల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ దేవాలయంలో కొబ్బరి చిప్పలు, వడిబియ్యం, చీరలు సేకరించే హక్కుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీపంతూ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో స్నేహీలతల సమక్షంలో శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో నలుగురు డిపాజిట్ దారులు పాల్గొన్నారు. మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ రూ.11,40,200 లకు వేలం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీ భాస్కర్, అర్చకులు మాదారం యాదగిరి, సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్, హర్షవర్ధన్, వెంకటేశ్, బీబీ చారి, అమర్ సింగ్ నాయక్, శివరామ్ నాయక్, గోపినాయక్, తదితరులు ఉన్నారు.


వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

నందిగామ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మహాపడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి చేపట్టిన పూజా కార్యక్రమంలో వందలాదిగా స్వాములు పాల్గొన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించిన భక్తులకు ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచాలని కోరుతూ స్వామిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.4.50 లక్షలు చెల్లించి పడి వందనం చేశారు.

నరేందర్ రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి సంతాపం

తలకొండపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి మృతి చెందారు. మృత దేహాన్ని శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. నరేందర్ రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు. నరేందర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, కృష్ణ, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జిగా శ్రీను



శ్రీనును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌదరిగూడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కొందుర్గు మండల ఇన్‌చార్జిగా కొందుర్గు మండల కేంద్రానికి చెందిన దుర్గని శ్రీనును ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రాములు, నరేందర్, కృష్ణ, చంద్రశేఖర్, ప్రసాద్, అశోక్, వేణుగోపాల్, రవి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, కొందుర్గు మండల కాంగ్రెస్ నాయకుల పనితీరు, నిజమైన కార్యకర్తలను మోసం చేస్తుండటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి, సోషల్ మీడియా ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు రామగళ్ళ శ్యామ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసినా.. అధికారంలోకి వచ్చాక పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నాడు.